క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 33వ, 34వ వార్డుల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ శేఖర్, వార్డు అధికారులు, సర్వేయర్లు ఉన్నారు.

గోడౌన్ ప్రారంభం



వర్ని(చందూర్): సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చందూర్ ఎన్డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ వసంత సూచించారు. శుక్రవారం చందూర్ సొసైటీ పరిధిలోని మేడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గోడౌన్‌ను ప్రారంభించారు. చందూర్ సొసైటీ చైర్మన్ అశోక్, ఉపాధ్యక్షుడు తారా సింగ్, డైరెక్టర్లు భజన్ లాల్, నీరెడి బాలయ్య, అంగోత్ శంకర్, మేడిపల్లి సాయిలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులో మంథని రైతుల ఆదర్శం



పెర్కిట్: ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ విద్యుత్ బిల్లులను ఒకే రోజు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. గ్రామానికి చెందిన 655 మోటార్లకు సంబంధించిన విద్యుత్ బిల్లులను రూ.360 చొప్పున రూ.2,35,600 నగదును ఒకే రోజు చెల్లించారు. లైన్‌మన్ సల్ల శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ లైన్‌మన్ లింబాద్రి, లైన్ ఇన్‌స్పెక్టర్ ముజీబ్, హోండా నర్సారెడ్డి, గాదెపల్లి నర్సారెడ్డి, గొల్ల నర్సయ్య, బిల్ కలెక్టర్లు యాకూబ్, సృచిత్ కుమార్ పాల్గొన్నారు.

ఖిల్లా భూములను కాపాడాలి

బాల్కొండ: మండల కేంద్రంలోని ఖిల్లా భూములను కాపాడాలని ఖిల్లా పరిరక్షణ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు నర్సింగ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎంవోలో వినతిపత్రం అందజేశారు. బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైనా ఇప్పటికి అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నకాశీ గుట్ట చుట్టు ఉన్న భూములను కొందరు కబ్జా చేశారన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు.

భూమిపూజ

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రంలో గ్రామ కమిటీకి అనుబంధంగా ప్రజా ఫంక్షన్ హాల్ నిర్మాణానికి వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, వీడీసీ అధ్యక్షుడు కారుపాకల నర్సయ్య, కోశాధికారి సోమ లింగారెడ్డి, ఏర్గట్ల సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని రైల్వేగేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వారితో పాటు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జానకంపేటలో..

ఎడపల్లి: మండలంలోని జానకంపేటలో శుక్రవారం డ్రంకన్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేతనాలు చెల్లించాలి

బోధన్‌టౌన్: మున్సిపల్‌లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు బి మల్లేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి మందిరంలోని ఆవరణలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కె గంగామణి, రాజమణి, ఎల్లప్ప, రమ, విజయ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

బాల్కొండ: రైతులు భూ సార పరీక్షలు చేయించాలని వ్యవసాయ విస్తరణ అధికారి రేష్మ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలం నాగాపూర్‌లో ఉచిత భూసార పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఉచిత భూసార పరీక్షలు చేపడుతోందని అన్నారు. కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం రైతులకు భూసార పరీక్షల కార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు అందేనా?

- మాజీ సర్పంచులకు రూ. 20.15 కోట్ల పెండింగ్ బిల్లులు
- పదవీ కాలం ముగిసినా అందని పరిస్థితి



మోర్తాడ్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచులకు పాత బకాయిలు ఇంకా అందలేదు. సర్పంచులుగా కొనసాగిన వారికి బిల్లు బకాయిలు రూ.20.15 కోట్లు అని అధికారులు లెక్క తేల్చారు. సర్పంచులు తమ జీపీల్లో అభివృద్ధి పనులు చేపట్టగా వాటికి ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇతరత్రా పథకాల ద్వారా నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఆర్థిక సంఘం నిధులను గతంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేస్తే అక్కడి నుంచి పంచాయతీ ఖాతాల్లో జమ అయ్యేవి. 2023–24 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్రం నేరుగా జీపీలకు నిధులను విడుదల చేయడం ఆరంభించింది. అంతకు ముందు పాత విధానమే అమలైనా ట్రెజరీల్లో ఫ్రీజింగ్ కారణంగా బిల్లులు పెండింగ్ అయ్యాయి. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేయడంలో జాప్యం కలిగింది. దీంతో సర్పంచ్‌లకు వారు పదవుల్లో ఉన్న సమయంలోనే పదవీ కాలం ముగిసిన తర్వాత బిల్లు బకాయిలు పేరుకుపోయాయి. తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో సైతం కొందరు సర్పంచులు ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. పదవీ కాలం ముగిసినా అదే పరిస్థితి నెలకొంది.

అత్యవసర తీర్మానాలే కొంప ముంచాయా..?

సర్పంచుల పదవీ కాలం గడిచిన ఫిబ్రవరి 2తో ముగిసింది. అంతకు ముందు శాసనసభ ఎన్నికల కారణంగా కోడ్ అమలులో ఉండటంతో అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడం కుదరలేదు. పదవీ కాలం ముగిసిపోయే ముందు కొన్ని జీపీల్లో అత్యవసర సమావేశాలు నిర్వహించి అప్పటికప్పుడు తీర్మానాలు చేసి పనులు ముగించారు. ఇది ఇలా ఉండగా మాజీ సర్పంచులకు బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం వేధిస్తోందని అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ఏకరువు పెట్టారు. దీనికి స్పందించిన మంత్రి సీతక్క బిల్లుల బకాయిలు త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీ ఇచ్చినా బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారనే విషయంలో స్పష్టత లేకపోవడంతో మాజీ సర్పంచులు అయోమయానికి గురవుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

సర్పంచులుగా పని చేసిన వారికి చెల్లించాల్సిన బిల్లు బకాయిల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదల కాగానే జీపీల వారిగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయి. ఎంబీ రికార్డుల ప్రకారం బిల్లుల చెల్లింపు ఉంటుంది.
– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి

హంగర్గా ఫారంలో పశు వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వెటర్నరీ జేడీ జగన్నాథ చారి

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గ ఫారంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన, పాల పోటీలను నిర్వహించారు. పశువులకు సూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. శిబిరంలో దూడల ప్రదర్శన, పాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథచారి హాజరై మాట్లాడారు. కృత్రిమ గర్భధారణతోనే మేలు జాతి దూడలు జన్మిస్తాయని, 90శాతం ఆడదూడలే జన్మిస్తాయని అన్నారు. పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి మాజీద్ అహ్మద్, పశు సంవర్ధక సహాయకులు బస్వారెడ్డి, మండల పశువైద్యాధికారి సురేశ్ కుమార్, రుద్రూర్ పశువైద్యాధికారి సంతోషరెడ్డి, వీఎల్‌వో మంజుల, వెటర్నరి సుధీర్ గౌడ్, సూపర్‌వైజర్ తిరుపతి, గోపాలమిత్రలు రియాజ్, నాగేశ్, మైత్రి రాజేశ్, పాలకేంద్రం చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌కు చేరిన శ్రీరామ స్వర్ణపాదుకలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శ్రీరామ స్వర్ణపాదుకల యాత్రను శుక్రవారం అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్‌కు చేరిన శ్రీరామ స్వర్ణపాదుకల యాత్రకు స్వాములు ఘన స్వాగతం పలికారు. ఈ యాత్ర అంబేడ్కర్ చౌరస్తా నుంచి జంబీ హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది. పాదుకలను హనుమాన్ ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పాదుకలు వివిధ రాష్ట్రాల గుండా అయోధ్యలోని శ్రీరామ మందిరానికి చేరుకొని అక్కడ పాదుకల పూజ నిర్వహించి తిరిగి హైదరాబాద్ చేరుకుంటాయని నిర్వాహకులు తెలిపారు. లక్ష మందితో రామ మాలధారణ దీక్ష ప్రారంభం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యాత్ర నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెంట జలంధర్, చారి రేగుళ్ల, సత్యనారాయణ, మసాలా సత్యనారాయణ, మీసాల రాజేశ్వర్, చేపూర్ ధనుంజయ్, ఉదయ్ కోలు శేఖర్, రామ రాజ్యం ట్రస్టు సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి, రాకేశ్ గౌడ్, విజయ్ రంగదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



బోధన్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు



ఆలూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో మాల మహానాడు నాయకులు, బీఎస్పీ, అంబేడ్కర్ సంఘం నాయకులు నిరసన తెలిపారు. పలు చోట్ల అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహించారు. వెంటనే అమిత్ షా ఎంపీ, మంత్రి పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



బాల్కొండలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



చందూర్‌లో..

మొక్కల పెంపకం వేగవంతం చేయాలి



శ్రీరాంపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో

బాల్కొండ: నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలంలోని శ్రీరాంపూర్, వన్నెల్(బి) గ్రామాల్లో నర్సరీలను, బాల్కొండ మండల కేంద్రంలో కోళ్ల పెంపకం షెడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రస్తుతం నర్సరీలో చేపడుతున్న మొక్కల పెంపకం వేగవంతం చేయాలన్నారు. లక్ష్యం తగ్గకుండా చేపట్టాలన్నారు. ప్రభుత్వం అందించిన కోళ్ల పెంపకం షెడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో ఇందిరా, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను సందర్శించిన అధికారులు



రెంజల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



ఆర్మూర్ డిగ్రీ కళాశాలలో అన్నంను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్/ రెంజల్/ బాల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మెనూ భోజనం అందించాలని సంబంధిత అధికారులు సిబ్బందికి సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో నూతన మెనూను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. కొత్త డైట్, పెరిగిన కాస్మోటిక్ చార్జెస్ గురించి, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ చంద్రిక, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు. రెంజల్ హైస్కూల్‌తో పాటు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని రెంజల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో ఆంజనేయులు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్ ఉన్నారు. ముప్కాల్ మండలంలోని నాగంపేట్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ముప్కాల్ మండల ప్రత్యేకాధికారిణి స్రవంతి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీవో గౌస్ మొయినొద్దీన్, హెచ్ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఉన్నారు.



నాగంపేట్‌లో..

సమాచారం..

■ నేడు లీగల్ అవర్నెస్ ప్రోగ్రాం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 11 గంటలకు లీగల్ అవర్నెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఎస్సై సందీప్ శుక్రవారం పేర్కొన్నారు. కార్యక్రమానికి బోధన్ జడ్జీలు, ఏసీపీ హాజరవుతారని తెలిపారు.

■ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గ్రహించి సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



బాల్కొండ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాలని కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో శుక్రవారం అండర్–20 బాలికల కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఈ నెల 22 నుంచి 25 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో పేట ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, రాజుకుమార్, అనురాధ, నాగా భూషణం, జ్యోతి, గంగాధర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థకు విరాళం



నందిపేట్: మండల కేంద్రంలోని శ్రీ గీత కాన్వెంట్ విద్యార్థులు హైదరాబాద్‌లోని సోచ్(అంధుల పాఠశాల) స్వచ్ఛంద సంస్థకు విరాళం అందజేశారు. శుక్రవారం స్థానిక ఎస్సై చిరంజీవి చేతుల మీదుగా సంస్థ స్పాన్సర్స్ రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఎం పద్మకు రూ. 67 వేల చెక్కును అందజేశారు. విద్యార్థులకు ఎస్సై అభినందనలు తెలుపుతూ మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కానూరి సాగర్, ఉపాధ్యాయులు భూషణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు కుట్ర పూరితం



భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న దొన్కంటి నర్సయ్య



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న నాయకులు

మోర్తాడ్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులతో కాంగ్రెస్ ప్రభుత్వం దొడ్డిదారిన కుట్ర పన్నుతోందని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం భీమ్‌గల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య మాట్లాడారు. తమకు కేసులు కొత్త కాదని తెలంగాణ కోసం ఎన్నో కేసులను ఎదుర్కొన్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌట్‌పల్లి రవి, గున్నాల బాల భగత్, మోయిజ్, రామచందర్‌గౌడ్, జోగన్పల్లి సతీశ్‌గౌడ్, బొదిరె నర్సయ్య, మూత లింబాద్రి, నాయకులు చిన్నోళ్ల రాజేశ్వర్, రెహమాన్, భూక్య రాజు, భూక్య సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసు కుట్ర పూరితమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్‌లో హైదరాబాద్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఇమేజ్‌ను తెచ్చి పెట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపులో భాగంగానే మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా ఈ కార్ రేసింగ్‌పై అబద్దాలు ప్రచారం చేసి ఏసీబీతో కేసు నమోదు చేయించారని మండిపడ్డారు. నాయకులు మైలారం సుధాకర్, బద్దం రాజేశ్వర్, నరేందర్, సంత రాజేశ్వర్, రఘు తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండలో మాట్లాడుతున్న నాయకులు

బాల్కొండలో..

బాల్కొండ: కేటీఆర్‌పై అక్రమంగా కేసులు పెడితే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఫార్ములా కారు రేసింగ్‌పై అన్యాయంగా కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీతో పోటీ పడాలన్నారు. సమావేశంలో నాయకులు సాగర్‌యాదవ్, శరత్, సాయన్న, మానేటి నాగాభూషణం, ఆకుల నరేందర్, షాహిద్, ఫయాజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఎడపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రిజిస్టర్లను పరిశీలించారు. రోగుల చికిత్స వివరాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట డాక్టర్ సాయిస్తా ఫిరదోస్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో మన్మోహన్ శాస్త్రి ఉన్నారు. అనంతరం ఎడపల్లి మండలం కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రెండు టిప్పర్లు సీజ్

బోధన్‌రూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. సీజ్ చేసిన టిప్పర్లు, ట్రాక్టర్‌ను పీఎస్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – మిస్‌యూ (తెలుగు) - 11.00, 7.30 10.20 పని (తెలుగు) -1.50 ఫియర్- 4.55
- స్క్రీన్-2 – పుష్ప-2 (తెలుగు) - 10.15 2.20 6.25 10.30
- స్క్రీన్-4– పుష్ప-2 (తెలుగు) -1.20 5.25 9.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 పుష్ప-2(తెలుగు)-1.30,7.00
- స్క్రీన్-2 పుష్ప-2-11.00,4.30, 10.00
- స్క్రీన్-3 మిస్‌యూ(తెలుగు)-10.40,1.20, 7.50,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10,10.15
- స్క్రీన్-2 ఫియర్(తెలుగు)-11.45 మిస్‌యూ(తెలుగు)-2.20 పుష్ప-2 (తెలుగు)-5.10,9.15
- స్క్రీన్-3 ప్రణయ గోదారి(తెలుగు)-11.10 పుష్ప-2(హిందీ)- 2.20 6.25 10.30
- స్క్రీన్ -4 పుష్ప-2(హిందీ)-10.00 పని(తెలుగు) -2.05 మిస్‌యూ-5.10 10.35 ఫియర్(తెలుగు)- 10.35

- లలితామహల్ మిస్‌యూ (తెలుగు)
- దేవి పని(తెలుగు)
- నటరాజ్ పుష్ప-2 (హిందీ)
- విజయ్ పుష్ప-2 (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,600	వెండి(కిలో)	91,000
22 క్యారెట్స్	72,520		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

సంక్షిప్తం

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు

మోర్తాడ్: సమస్యల పరిష్కారానికి సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఏర్గట్ల కాంప్లెక్స్‌లోని భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. శుక్రవారం భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించగా భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణాచారి, కాంప్లెక్స్ కార్యదర్శి మునీరొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మోర్తాడ్: భీమ్‌గల్‌లోని అయ్యప్ప ఆలయం వద్ద శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు నంబి వాసు నిర్మాణ పనులకు పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం

పెర్కిట్: ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలంలో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలూర్ మండల కేంద్రంతో పాటు ఆర్మూర్ మండలంలోని కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ సందర్భంగా గణిత శాస్త్రంపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు గణిత శాస్త్ర సిద్ధాంతాల చార్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలూర్ ఎంఈవో నరేందర్, అశ్ఫాక్ అహ్మద్, ఇట్టం గోపాల్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

వేల్పూర్: సిలిండర్ ద్వారా మంటలు చెలరేగినప్పుడు వాటిని ఏవిధంగా ఆర్పివేయాలో వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆర్మూర్ అగ్నిమాపక అధికారి మధుసూదన్‌రెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు వీణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్: మండలంలోని మోతెలో ముగ్గురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు భగవాన్‌దాస్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు ముత్తెన్న, కొమ్ముల శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లిలో..

మండలంలోని వేంపల్లిలో నలుగురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ధనుష్ యాదవ్, జక్క రాజేశ్వర్, మహేశ్, జక్క గంగాధర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ గ్రామానికి చెందిన అర్తిక్ కంటి సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో బాధితుడికి మెరుగైన వైద్య కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రభుత్వం రూ. 2.5 లక్షల ఎల్‌వోసీని అందజేసింది. సునీల్‌రెడ్డి ప్రతినిధి శుక్రవారం బాధిత కుటుంబానికి ఎల్‌వోసి అందజేశారు.